అదనపు భారంతో అవస్థలు

- సర్వేల పేరిట కార్యదర్శులకు పని ఒత్తిడి
- ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీలు
- జీపీ కార్మికులు, సిబ్బందికి అందని వేతనాలు
- నిధులు లేక సొంత డబ్బులు వెచ్చిస్తున్న వైనం
- పాలకవర్గం లేదు.. ప్రత్యేకాధికారుల పట్టింపు కరువు

హుజూరాబాద్: పంచాయతీ కార్యదర్శులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సమయానికి నిధులు అందక జీపీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. కార్యదర్శులే ఐదు నెలలుగా ట్రాక్టర్ డీజిల్‌తో పాటు ఇతరత్రా మరమ్మతుల కోసం సొంత డబ్బు వెచ్చిస్తున్నారు. దీనికి తోడు అధికారులు అప్పగిస్తున్న వివిధ సర్వేలతో ఇబ్బందులు పడుతున్నారు. జీపీ కార్మికులకు కొద్ది నెలలుగా జీతాలు చెల్లించకపోగా వారిని సముదాయించి పని చేయించడానికి కార్యదర్శులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. వీరు ఉన్నా లేనట్టుగానే వ్యవహరిస్తున్నారు. జీపీలకు కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు అందక నెలలు గడుస్తున్నాయి. దీంతో పంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

గతంలో గ్రామ అభివృద్ధి పనులతో పాటు ఇతర వ్యవహారాలు సర్పంచ్, పాలకవర్గాలు చూసుకునేది. ఫిబ్రవరితో పదవీకాలం ముగియగానే ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ప్రత్యేకాధికారిని నియమించింది. ఇతర శాఖలో కీలకంగా ఉన్న గెజిటెడ్ అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారు గ్రామాలపై సరైన దృష్టి సారించలేకపోతున్నారు. మాతృ శాఖకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఎప్పుడో ఒకసారి గ్రామాలకు వెళ్లి సలహాలు, సూచనలు ఇవ్వడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. పంచాయతీ పాలన భారం కార్యదర్శుల పైనే పడుతోంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పనుల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, పన్నుల వసూళ్లు, ఆదాయ, వ్యయం లావాదేవీలు, నెలవారి చెల్లింపులు తదితర విషయాలన్నీ కార్యదర్శులు పర్యవేక్షించాల్సి వస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పు చేసి జీపీ బాధ్యతలను నిర్వహిస్తున్నామని, పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదని కార్యదర్శులు వాపోతున్నారు. ట్రాక్టర్‌కు అవసరమైన డీజిల్‌తో పాటు పల్లె ప్రకృతి వనాలు, పారిశుధ్య నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్‌యార్డులు, శ్మశానవాటిక నిర్వహణ, వాటర్ ట్యాంక్‌ల క్లోరినేషన్ తదితరవి కార్యదర్శులే నిర్వహిస్తున్నారు. వసూలైన పన్నులు, ఇతరత్రా ఆదాయం సాధారణ ఖర్చులకు సరిపోవడం లేదు. ఏదైనా మరమ్మతులు, అత్యవసర అవసరాలకు పంచాయతీ కార్యదర్శులే జేబు నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా కార్యదర్శులు నలిగిపోతున్నారు.



రాంపూర్‌లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

సర్వేలతో సతమతం

మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు పంచాయతీల పాలనతో అష్టకష్టాలు పడుతున్న కార్యదర్శులపై వివిధ సర్వేల భారం మోపుతున్నారు. దీంతో మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. తమశాఖకు సంబంధం లేని సర్వేలను అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటా మిషన్ భగీరథ నల్లాల వివరాలను నమోదు చేసే విషయంలో కార్యదర్శులే కీలకంగా వ్యవహరించారు. తాజాగా కుటుంబ సర్వే చేపట్టాలనడంతో కార్యదర్శులు మరింత ఇబ్బందులకు లోనవుతున్నారు.

హుజూరాబాద్ డివిజన్‌లో జీపీ కార్యదర్శుల వివరాలు

మండలం	కార్యదర్శులు
హుజూరాబాద్	20
జమ్మికుంట	20
వీణవంక	26
ఇల్లందకుంట	18
సైదాపూర్	29
మొత్తం	113

సర్వేల నుంచి మినహాయించాలి



పలు సర్వేల నుంచి కార్యదర్శులను మినహాయించాలి. గ్రామాలలో అత్యవసర పనుల కోసం సొంత డబ్బులను ఖర్చు పెడుతున్నాం. పంచాయతీరాజ్‌శాఖ పనులే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన పనులు చేయించడం ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి పనిభారం తగ్గించే చర్యలు తీసుకోవాలి.

– గౌరి రమేశ్, కార్యదర్శుల సంఘం, జిల్లా అధ్యక్షుడు

జీతాలు చెల్లించాలి



ఎన్నికల హామీలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల 1న జీతాలు చెల్లిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ జీపీ కార్మికులు మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శులకు అదనపు పనిభారం మోపడం సరికాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కారించాలి.

–వడ్లూరి వాసు, జేడీఎస్, రాష్ట్ర కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఒకలా అధికారంలోకి వచ్చాక మరోలా వ్యవహరిస్తూ జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయకపోవడంతో ఐదేళ్లుగా ఎటువంటి ప్రమోషన్లు లేకుండా పని చేస్తున్నారు. వారిపై పనిభారాన్ని తగ్గించాలి.

– మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం, జిల్లా కార్యదర్శి



హుజూరాబాద్: మండలంలోని రాంపూర్ గ్రామం అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు ప్రమాదంబారినపడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
టి. సునీత, ఎంపీడీవో హుజూరాబాద్., సెల్ నంబర్ 99899 30709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ముగిసిన క్రీడలు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో నాలుగు రోజులగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు హాజరై మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో స్నేహ భావాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్టీ జోనల్ అధికారి లలిత, ప్రిన్సిపల్ జగన్నాథం, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చయ్య, అశోక్‌బాబు, కాళహస్తి, సత్యనారాయణ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



ముగింపు సంబరాల్లో క్రీడాకారులు

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల పరిశీలన



తూకాన్ని పరిశీలిస్తున్న ఓదెలు

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి, ఈదులగట్టెపల్లి, శ్రీనివాస్‌నగర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు గురువారం పరిశీలించారు. కొనుగోళ్లలో ఇబ్బందులను సెంటర్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తేమశాతం ఉన్న వాటిని వెంటనే తూకం వేయాలని, కాంటా సరిగా నిర్వహించాలని సూచించారు.

బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు మల్లేశ్

జమ్మికుంట: బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ అన్నారు. గురువారం జమ్మికుంటలో సంస్థాగత ఎన్నికల వర్క్‌షాపు, పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండలంలోని కోరపల్లిలో ఆన్‌లైన్, క్రియాశీల సభ్యత్వంపై సమావేశం నిర్వహించగా మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రవి, రాజేశ్, మధు, రాజు, స్వరూప, రవిచంద్రారెడ్డి, అశోక్, శివకుమార్, మోడెం రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

షాట్‌పుట్‌లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థినిని అడబాల రాజీ కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో స్వర్ణపతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, క్రీడా సమన్వయకర్త మంగమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినికి కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపింది.

నియామకం

హుజూరాబాద్: పట్టణానికి చెందిన అందె వెంకటేశ్వరరావును బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమకమయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయభాస్కర్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.



అందె వెంకటేశ్వరరావు

దుకాణాల తొలగింపుపై వాగ్వాదం

జమ్మికుంట: పట్టణంలోని కోరపల్లి రోడ్డులో పాత కూరగాయల మార్కెట్ దుకాణాల తొలిగింపుపై వ్యాపారులు, కమిషనర్ ఎండీ అయాజ్, అధికారులకు మధ్య గురువారం వాగ్వాదం నెలకొంది. కూరగాయల మార్కెట్‌ను పట్టణ నడిబొడ్డున పాత మార్కెట్ యార్డులో రూ.రెండు కోట్లతో నిర్మించి వ్యాపారులకు ఒకటి నుంచి తొమ్మిది దుకాణాలను కేటాయించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలని కమిషనర్ ఎండీ అయాజ్, టీపీవో శ్రీధర్, మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి, అధికారులు వ్యాపారులకు సూచించారు. అక్కడ వ్యాపారం సరిగా నడవడం లేదని ఆర్థికంగా నష్టపోయి రోడ్డు పడుతున్నామని అధికారులతో గొడవకు దిగారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యాపారం నిర్వహించుకొమ్మన్నారని అన్నారు. పట్టణ ప్రగతి దృష్ట్యా రూ.రెండు కోట్లతో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేశామని కమిషనర్ అన్నారు. మరో రూ.మూడు కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మిస్తున్నామని, వ్యాపారుల కోసం ప్రభుత్వం రూ.కోట్లు కేటాయించిందన్నారు. గతంలో కోర్టుకు వెళ్లినప్పటికీ కోర్టు సైతం సౌకర్యాలు కల్పించి, కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలని తీర్పు ఇచ్చిందని, కోర్టు తీర్పు కాదని పాత స్థలంలో కురగాయలు అమ్ముకోవడం సరి కాదని, స్థలం ఖాళీ చేసి కేటాయించిన స్థలంలో కూరగాయలు విక్రయించుకోవాలని అన్నారు. మున్సిపల్ నిబంధనలు ఉల్లఘించొద్దన్నారు.



కమిషనర్‌తో వాదనకు దిగుతున్న వ్యాపారులు



జెండా ఎగురవేస్తున్న చైర్మన్ పొనగంటి సంపత్



మెట్‌పల్లిలో జెండా ఎగురవేస్తున్న చైర్మన్ సంజీవరెడ్డి

సహకార వారోత్సవాలు

జమ్మికుంట: పట్టణంలోని పీఏసీఎస్‌లో జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా అఖిల భారత సహకార సంఘాల వారోత్సవాలను చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఏడు రంగుల సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి ఉందని, సహకార సంఘాలు అవసరమైన వస్తువుల పంపిణీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు పంటలకు సంబంధం లేకుండా పంట రుణాలు అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనగోళ్లు చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, సీఈవో రవీందర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి, తాడికల్ విండోలో గురువారం సహకార వారోత్సవాలు నిర్వహించారు. సహకార వారోత్సవాల సందర్భంగా చైర్మన్లు సంజీవరెడ్డి, మధుకర్‌రెడ్డి జెండా ఎగురవేశారు. ఈకార్యక్రమంలో సీఈవోలు సదయ్య, వీరస్వామి, డైరెక్టర్లు ఉన్నారు.

నడకతో మధుమేహం నియంత్రణ

శంకరపట్నం: నడకతో మధుమేహాన్ని నియంత్రించవచ్చని కేశవపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం డాక్టర్లు, వైద్యసిబ్బంది రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. తెల్లబియ్యం, షుగర్, ఉప్పుతో మధుమేహం వచ్చే అవకాశం ఉందని, 30 ఏళ్లుపైబడిన వారు పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య మహిళాక్యాంపు నిర్వహించి 56 మందికి వివిధ పరీక్షలు చేశారు.



పీహెచ్‌సీ ఎదుట వైద్యులు, సిబ్బంది, రోగుల ప్రతిజ్ఞ



ఇల్లందకుంట: శ్రీరాములపల్లిలో చిల్డ్రన్స్ డే



శంకరపట్నం: నివాళి అర్పిస్తున్న నాయకులు

ఘనంగా బాలల దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్: హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాల్లో గురువారం జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. హుజూరాబాద్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ తరఫున నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

- **సిర్సపల్లిలో న్యాయవిజ్ఞాన సదస్సు**

హుజూరాబాద్: మండలంలోని సిర్సపల్లి గ్రామం జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి కిరణ్‌కుమార్ వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఎస్‌ఐ కమల, ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లేశం, ఉపాధ్యాయులున్నారు.

- **మస్టర్లు జాగ్రత్తగా రాయాలి**

మానకొండూర్‌రూరల్: ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లను సరిగా రాయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ నివేదిక కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పని ప్రదేశంలో కొలతలు సక్రమంగా తీసుకోవాలని, ఎండిపోయిన మొక్కలను లెక్కించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. తనిఖీలో రూ.75 వేల తేడా వచ్చిందని, అట్టి డబ్బులను సంబంధిత సిబ్బంది నుంచి రికవరి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ కృష్ణ, విజిలెన్స్ అధికారి వెంకటేశ్వర్లు, క్వాలిటి కంట్రోలర్ శ్రీనివాస్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు**

వీణవంక: మండలంలోని పలు గ్రామాల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ కింద రూ.78.50 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ సాహెబ్‌హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. సీసీరోడ్లు, డ్రైయినేజీలు, హైమాస్ట్ లైట్లు కోసం కోర్కల్, మల్లారెడ్డిపల్లి, రెడ్డిపల్లి, వల్భాపూర్, లస్మక్కపల్లి, చల్లూరు, మామిడాలపల్లి, బ్రాహ్మణపల్లి, నర్సింగాపూర్ , హిమ్మత్‌నగర్, ఘన్ముక్కుల, ఎల్బాక, గంగారంకు నిధులు విడుదలయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఒడ్డెపల్లి కొంరయ్య, మధుకర్‌రెడ్డి, ఈదునూరి పైడికుమార్, గెల్లు కొంరయ్య ఉన్నారు.

- **డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా**

శంకరపట్నం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి హుజూరాబాద్ న్యాయమూర్తి ఈశ్వరయ్య రూ.రెండువేల జరిమానా విధించారని ఎస్సై రవి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.

- **గీత కార్మికుడు మృతి**

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన ముడగాని కనుకయ్య గురువారం ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కనకయ్య యథావిధిగా గురువారం ఉదయం తాటికమ్మలు కోస్తుండగా కింద పడిపోయాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు, భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

- **కలెక్టర్‌కు ఫిర్యాదు**

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పరిధి మొటంపల్లె నుంచి ఇందుర్తి వరకు వ్యవసాయభూమిలోకి వెళ్లకుండా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు రోడ్డుకు అడ్డుగా రాతికనీలు పాతారని, దీంతో కోతకు వచ్చిన ఐదెకరాల వరి నేలరాలిపోతోందని మొటం బాలయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్టోబర్‌లో చిగురుమామిడి పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కనీలను తొలగించేందుకు ప్రయత్నించగా చంపుతామని బెదిరిస్తున్నారని బాలయ్య పేర్కొన్నారు. కోతకు వచ్చిన పంటను కోయనిపక్షంలో కుటుంబ సభ్యులందరం ఆత్మహత్య చేసుకుంటామని, తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

సంక్షిప్త వార్తలు

- **గ్రంథాలయ వారోత్సవాలు**

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కళాశాలలకు గ్రంథాలయం గుండెకాయలాంటిదని, గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు రామ్మోహన్, అధ్యాపకులు భాస్కర్, శోభన్, రవీందర్, జైపాల్‌రెడ్డి, కల్పన, శైలజ, సుమలత పాల్గొన్నారు.

- **డైరెక్టర్లకు సన్మానం**

వీణవంక: జమ్మికుంట మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లను అతిథి డెవలపర్ అధినేత కొమ్మిడి రాకేశ్ రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సన్మానించారు. మండలం నుంచి శ్రీపతిరెడ్డి, సునీల్, రషీద్‌పాషా, సతీశ్ డైరెక్టర్లుగా నియామకమయ్యారు. రైతులకు అన్నివిధాలా సహకరించేందుకు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నల్ల కొండాల్‌రెడ్డి, పోతరవేన సతీశ్, కుమార్, విద్యాసాగర్, గట్టయ్య, రాజగోపాల్, కుమార్ ఉన్నారు.

- **విద్యుత్ అధికారుల పొలం బాట**

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామంలో విద్యుత్ అధికారులు పొలం బాట పట్టారు. గ్రామస్తులకు విద్యుత్ సరఫరాపై అవగాహన కల్పించారు. విద్యుత్ సరఫరా, అంతరాయం తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌కు సంబంధించిన ఇబ్బందులను నమోదు చేసుకున్నారు. ప్రమాదాల నివారణపై వివరించారు. కార్యక్రమంలో ఏఈ సర్వేశ్వరచారి, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఆనందం, అసిస్టెంట్ లైన్‌మెన్ యాకుబ్‌పాషా, లైన్‌మెన్లు కాంతాల సమ్మిరెడ్డి, కాసర్ల వీరాస్వామి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పైడికుమార్ ఉన్నారు.

- **ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం**

చిగురుమామిడి: మండలంలోని ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పోరాటం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. మండలంలో భూనిర్వాసితులు, కార్మిక, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అనేకమున్నాయని, రెవెన్యూ, మండలపరిషత్ కార్యాలయాలకు వచ్చేవారి పక్షాన ఉద్యమాలు చేయాల న్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీలత, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ఆశావర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు పద్మ, హమాలీ సంఘం అధ్యక్షుడు మల్లేశం, పంచాయతీ కార్మిక సంఘం నాయకుడు రాములు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సంపత్, పశుమిత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభ పాల్గొన్నారు.

- **స్మారక స్తూపం ఆవిష్కరణ**

చిగురుమామిడి: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం, ఉద్యమాలు చేసిన నాయకుల స్మరణకు స్మారక స్తూపాలు నిర్మిస్తారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని రేకొండ గ్రామంలో గురువారం సీపీఐ సీనియర్ నాయకుడు దుడ్డెల వెంకటయ్య స్మారక స్తూపాన్ని వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. ప్రజల కోసం పనిచేసేవారు కొందరే ఉంటారని తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతఐలమ్మ అన్నారు. కార్యక్రమానికి బోయిని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అధ్యక్షత వహించగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, గడిపె మల్లేశ్, పల్లె నర్సింహా, జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు స్వామి, రజక సంఘం జాతీయ నాయకుడుమల్లేశ్, రజక సంఘం రాష్ట్ర నాయకుడు సంపత్, జిల్లా నాయకుడు అశోక్, లక్ష్మి, బాబు, మండల సీపీఐ కార్యదర్శి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

- **టై, బెల్టుల అందజేత**



చొప్పదండి: మండలంలోని రాగంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వ్యాపారి నలుమాచు మనోహర్, రాధ దంపతులు గురువారం రూ.పదివేల విలువైన టై, బెల్టులు విరాళంగా అందించారు. హెచ్‌ఎం రవీందర్, కనకయ్య, సాయన్న, సరోజన, శశికళ, విజయలక్ష్మి, శంకరయ్య దాతలను ఘనంగా సన్మానించారు.

- **ఆర్థిక సహాయం**

హుజూరాబాద్: పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన దినసరి కూలీ మామిడి మొగిళి(50) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం వార్డు కౌన్సిలర్ కేసీరెడ్డి లావణ్య నర్సింహారెడ్డి మృతుడి కుటుంబానికి రూ.ఐదువేలు, నిత్యావసర వస్తువులను అందజేశారు.

ఇల్లందకుంట: మండలంలోని బుజునూర్ గ్రామానికి చెందిన దుంద్ర లత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆదేశాలతో గురువారం మాజీ ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేశ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.ఐదువేలు అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ ఎగ్గడి జగన్, ఉపసర్పంచ్ మల్లయ్య, కుమార్‌యాదవ్, ఐలయ్య, చంద్రయ్య, సాంబయ్య, విజయ్, కిరణ్ కుమార్, అనిల్, రఘుకుమార్, రాములు తదితరులు పాల్గన్నారు.

సూర్యు'డి' కోసం



శరీరానికి విటమిన్-డి అత్యంత కీలకం. హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 13న వైద్యులు సోమశేఖర్, నిశ్చల, నారాయణరెడ్డి, మహిపాల్ పర్యవేక్షణలో ఒకే రోజు 12 మంది గర్భిణులకు సాధారణ ప్రసవం చేశారు. సూర్యరశ్మి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పిల్లల ఆరోగ్యానికి రోజూ ఉదయం చిన్నారులను కాసేపు ఎండలో ఉంచాలని సూచించారు. ఈనేపథ్యంలో గురువారం చిన్నారులకు ఎండ తగిలేలా బంధువులు పిల్లలను ఎత్తుకోగా ఆ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో క్లిక్‌మనిపించింది. - హుజూరాబాద్